ముక్కంటి సేవలో ఇస్రో ఛైర్మన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇస్రో ఛైర్మన్ నారాయణన్ కుటుంబ సమేతంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఇస్రో ఛైర్మన్ నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ ఇస్రో 100 వ రాకెట్ ప్రయోగం పిఎస్ఎల్వి ఎఫ్15 ప్రయోగం విజయవంతం కావాలని ముక్కంటిని ప్రార్థించినట్లు చెప్పుకొచ్చారు. ఇస్రో 100వ రాకెట్ ప్రయోగానికి సిద్ధం కావడం దేశానికి గర్వకారణమన్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతమయితే భారతదేశానికి అమూల్యమైన సేవలు అందుతాయని వివరించారు.

వైసిపి, కూటమి పార్టీలకు సవాల్

డిప్యూటీ మేయర్ రేస్ 'స్టార్ట్'

- 3న ఎన్నికల నిర్వహణకు కసరత్తు
- మేయర్, డిప్యూటీ మేయర్‌పై టిడిపి కన్ను
- నేడో, రేపో జిల్లామంత్రి 'అనగాని' రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఛైర్మన్, మేయర్లు, డిప్యూటీ మేయర్ల పదవులకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక అటు వైసిపికి, ఇటు కూటమి ప్రభుత్వానికి సవాల్ కానుంది. మరోవైపు ఎంఎల్ఎ టికెట్ వదులుకున్న నేపథ్యంలో ఛైర్మన్, డిప్యూటీ మేయర్ పదవులు తమకే కావాలని టిడిపి పట్టుబట్టనుంది. ఈ తగవు తీర్చేందుకే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధ, గురువారాల్లో తిరుపతికి వస్తారని చర్చ నడుస్తోంది. డిప్యూటీ మేయర్ రేస్‌లో కూటమి అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. 3వ తేదీ ఎన్నికల నిర్వహణకు తిరుపతి కార్పొరేషన్ అధికారులు ఎస్వీ సెనెట్ హాలులో ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం వైసిపికి 32 మంది కార్పొరేటర్లు ఉన్నారని వారు చెబుతున్నారు. వీరికితోడు వైసిపి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం కూడా ఓటు హక్కు వినియోగించుకుంటారు. టిడిపి జనసేన కూటమికి కేవలం 12 మంది కార్పొరేటర్లే వారివైపు ఉన్నారని ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ మేయర్ పదవి కైవసం చేసుకోవాలంటే కనీసం 27 నుంచి 28 మంది కార్పొరేటర్ల బలం కావాలి. అయితే కూటమి నేతలు కార్పొరేటర్లకు ప్రలోభపెట్టి తమవైపు తిప్పుకోడానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

మేయర్, డిప్యూటీ మేయర్‌పై టిడిపి కన్ను

తిరుపతి ఎంఎల్ఎ టికెట్‌ను కోల్పోయిన తమకు మేయర్, డిప్యూటీ మేయర్ ఖచ్చితంగా ఇవ్వాల్సిందేనని టిడిపి నేతలు పట్టుబడుతున్నాఉ. మంగళవారం తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ నివాసంలో టిడిపి నగర నేతలు సమావేశం అయ్యారు. పొత్తులో భాగంగా తిరుపతిని వదులుకున్న టిడిపికి డిప్యూటీ మేయర్ పదవి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణకు ఇవ్వాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోవైపు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు తాను సూచించిన కార్పొరేటర్‌ను డిప్యూటీ మేయర్ చేయాలని భావిస్తున్నారు. అయితే కూటమి నేతలంతా కలిసి ఒక పేరును ప్రతిపాదించే అవకాశం లేకపోలేదు. డిప్యూటీ మేయర్ ఎన్నికల సందర్భంగా ఎంతమంది కార్పొరేటర్లు వైసిపి, కూటమి వైపు ఉన్నారో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి అత్యధికంగా కార్పొరేటర్లను గెలిచి మేయర్ పదవితో పాటు, రెండు డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకుంది. 50 డివిజన్లలో 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో వైసిపి 47 గెలుపొందగా, 35వ డివిజన్‌లో టిడిపి అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణ గెలుపొందారు. ఏడో డివిజన్‌కు ఎన్నిక జరగలేదు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. 24వ డివిజన్ కార్పొరేటర్ వైసిపికి చెందిన హనుమంతనాయక్ అనారోగ్యంతో మృతిచెందారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్‌గా భూమన అభినయ్‌రెడ్డి ఏకగ్రీవమయ్యారు. మేయర్ పదవి 'యాదవు'లకు ఇస్తామని చెప్పడంతో డాక్టర్ శిరీషకు కట్టబెట్టారు. మొదటి డిప్యూటీ మేయర్ పదవిని ముద్ర నారాయణకు ఇచ్చారు. రెండో డిప్యూటీ మేయర్ పదవిని తాజా ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్‌రెడ్డికి ఇచ్చారు. డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేసి 2024 ఎన్నికల్లో తిరుపతి వైసిపి అభ్యర్థిగా అభినయ్‌రెడ్డి పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆ రెండో డిప్యూటీ మేయర్ పదవిని కైవసం చేసుకోవాలని కూటమి చూస్తోంది. తిరుపతి కార్పొరేషన్ మేయర్‌గా డాక్టర్ శిరీష వైసిపిలోనూ, డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముద్రనారాయణ ప్రస్తుతం కూటమిలోనూ కొనసాగుతున్నారు. ముద్రనారాయణ పదవికి ఢోకా లేకపోయినా టిడిపి వైపు మొగ్గుచూపుతున్నాడు. అయితే తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు జనసేనలోకి రావాలని కోరుతుండటం గమనార్హం.

మేయర్ పదవిపై 'అన్నా' కుటుంబం కన్ను

తిరుపతి కార్పొరేషన్ మేయర్ పదవి కోసం ఎన్నికల ముందు నుంచే అన్నా రామచంద్రయాదవ్ కుటుంబం కన్నేసింది. 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనితయాదవ్ ప్రయత్నాలు చేశారు. అయితే మెజార్టీ కార్పొరేటర్లు వారి వైపు రాకపోవడంతో ఛైర్మన్ మార్పు వాయిదా పడింది. మూడు నెలల క్రితం తిరుపతి మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని అనుకున్నా 'కూటమి' వెనకడుగు వేసింది. వైసిపికి ఎక్కువమంది కార్పొరేటర్ల బలం ఉండటమే ఇందుకు కారణం.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న పీసీ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే కర్తవ్యం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఉన్నత విద్యారంగాన్ని సంస్కరించవలసిన అవసరం ఉందని ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా 5వ జిల్లా మహాసభలు ఎస్వి యూనివర్సిటీలో సీతారాం ఏచూరి ప్రాంగణంలో మంగళవారం ప్రారంభించారు. జిల్లా మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలు గల ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం పిసి వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం రోజురోజుకూ బలహీన పడి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా లక్షలాది మంది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు బడికి దూరంగా ఉన్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కొంత మంది చదువుకున్నా ఉన్నత విద్యా ప్రవేశంలో డ్రాపౌట్లు పెరుగుతున్నాయన్నారు. విద్యా వ్యాపారం అవ్వడమే ప్రధాన కారణమన్నారు. అందరికీ సమానత్వం గల కామన్ విద్యా విధానం అమలు కావాలన్నారు. రాష్ట్రంలో 17 విశ్వ విద్యాలయాల్లో ఖాళీగ అన్న శాశ్వత ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెనలను సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, నరేంద్ర, తేజ, బాల, ఉమేష్, గురవయ్య పాల్గొన్నారు.



బాగున్న డివైడర్ కొట్టేయడంతో రోడ్డు వెడల్పు చేస్తారేమోనని స్థానికుల్లో భయం

డివైడర్... ప్రజల్లో 'ఫియర్'

9 అంగుళాల వెడల్పుకు రూ.53 లక్షలు

రోడ్డు వెడల్పుచేస్తే భవనాలూ కొట్టక తప్పదా..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కొండను తవ్వి ఎలుకను పట్టడం అనే సామెత వినే ఉంటారు. ఈ సామెతకు సరిపోయే విధంగా శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎవరు సలహా ఇచ్చారో...! ఎందుకు ఇచ్చారో... ! ఎవరి కోసం ఇచ్చారో..! తెలియదు కానీ కొండను తవ్వి చిట్టెలుకను పట్టే కార్యక్రమం మాత్రం వేగంగా కొనసాగుతోంది. పట్టణంలోని పానగల్‌లో ఉన్న ఏపీ సీడ్స్ కూడలి నుంచి రామసేతు వంతెన వరకు ఉన్న ఒకవైపు డివైడర్‌ను మున్సిపల్ అధికారులు హడావుడిగా ధ్వంసం చేశారు. వెడల్పు చేసి మరింత అందంగా తీర్చి దిద్దుతామని ప్రకటించారు. కేవలం ఒకవైపున గోడను మాత్రమే తొలగించి మధ్యలో ఉన్న మట్టిని, చెట్లను పూర్తిగా తీసేశారు. వెడల్పు తక్కువగా ఉండటం వల్ల అందంగా కనిపించడం లేదని, మరింత వెడల్పు చేస్తామని తెలిపారు. అధికారులు పనులు వేగంగా చేయిస్తున్నారు. డివైడర్ తొలగించిన వైపు గోడ నిర్మాణం తిరిగి జరుగుతోంది. దీనివల్ల డివైడర్ కేవలం 9 అంగుళాల వెడల్పు మాత్రమే పెరుగుతుందని అధికారులు చెబుతున్న మాట.

9 అంగుళాలకు రూ. 53 లక్షల నిధులు

డివైడర్ ఒక వైపు వెడల్పు చేయడానికి మున్సిపల్ అధికారులు రూ. 53 లక్షలు ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. బాగున్న డివైడర్ను తొలగించి 9 అంగుళాల వెడల్పు కోసం డివైడర్ ను తొలగించడం అధికారుల అత్యుత్సాహమో...! అనాలోచిత నిర్ణయమో...!నిధుల దుర్వినియోగమో..! తెలియడం లేదు. అయితే వారం రోజులుగా రామసేతు వంతెన నుంచి ఏపీ సీడ్స్ కూడలి వరకు వెళ్లే ప్రయాణికులు, స్థానికులు దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ని మళ్ళించారు. కొత్త డివైడర్ నిర్మాణం అయితే పర్వాలేదు. పాత దానికి మరమ్మతులైతే మరీ మంచిది. ఒకవైపు ఉన్నదాన్ని తొలగించి 9 అంగుళాల వెడల్పు చేసి తిరిగి నిర్మాణం చేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి. డివైడర్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత రోడ్డును ఒక వైపు ఒక మీటరు వెడల్పు చేస్తారట. డివైడర్ను వెడల్పు చేస్తున్న వైపు ఒక మీటరు పెంచడానికి చాలా ఆటంకాలున్నాయి. పలుచోట్ల భవనాలు రోడ్డుకు పక్కనే ఉన్నాయి. ఆక్రమణలు ఉంటే తొలగించడానికి వీలవుతుంది. భవనాలను తొలగించాలంటే ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ రావాలి. నష్టపరిహారం ప్రకటించాలి. దానికి అందరూ అంగీకరించాలి. భవనాలను పడగొట్టాలి. రోడ్డు నిర్మాణం చేయాలి. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసే అవకాశాలు లేవు. మరి ఏం సాధించడానికి అధికారులు డివైడర్ ను ఒకవైపు ధ్వంసం చేయడం, ఇంకో వైపు రోడ్డును వెడల్పు చేయడం చూస్తుంటే "ఒకవైపే చూడు రెండోవైపు చూడకు" అన్న సినిమా డైలాగును గుర్తుకు తెస్తోంది అదేవిధంగా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందంటూ పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

30న తెలుగుగంగ సరఫరాకు అంతరాయం

తిరుపతి టౌన్ : నగరానికి తాగునీరు అందించే పైపులైను మరమ్మతుల కారణంగా ఈనెల 30న గురువారం నీటి సరఫరా ఉండదని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. పంపింగ్ మెయిన్‌లైన్ల మరమ్మతులు కారణంగా వినియోగదారులు సహకరించాలని కోరారు.

'స్మార్ట్‌సిటీ' పనులు గడువులోపు పూర్తవ్వాలి

తిరుపతి టౌన్: స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవనాన్ని సమయంలోపు పూర్తి చేయాలన్నారు. స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, ఎన్ ఇ సి ప్రతినిధులు ప్రదీప్, జమాల్, అంబర్, ఫణి కుమార్, కెల్ట్రాన్ సతీష్, ఏఇకామ్ ప్రతినిధులు బాలాజీ పాల్గొన్నారు.

గూడూరు ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

గూడూరు టౌన్ : గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా జరిగింది. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి, సిడాప్, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ మూడు బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, నిరుద్యోగులకు మంచి అవకాశమని తెలిపారు. 57 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరుకాగా 23 మంది అర్హత సాధించారు.



సుభాష్ పాలేకర్ వ్యవసాయాన్ని అనుకరించాలి

క్యాంపస్ : హరిత విప్లవం ఆరోగ్యకరమైన భారతాన్ని దెబ్బ తీసిందని పద్మశ్రీ అవార్డీ సుభాష్ పాలేకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ శ్రీనివాస ఆడిటోరియంలో మంగళవారం జరిగిన 'సుభాష్ పాలేకర్ క్రిషి' వ్యవసాయ విధానంపై ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.పాకనాటి హరికష్ణ అధ్యక్షతన ముఖ్యవక్తగా పద్మశ్రీ సుభాష్ పాలేకర్, ముఖ్య అతిథులుగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె మురళీమోహన్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ పాలేకర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ హరిత విప్లవం ద్వారా దిగుబడి పెరిగినా భారతదేశ ఆరోగ్యాన్ని చాలా దెబ్బతీసిందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి పాలేకర్ క్రిషి, సేవ్ సంస్థ ప్రతినిధి విజయరామ్ జి, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఆచార్య సుధారాణి, ఆచార్య శ్రీనివాస్, ఆచార్య నరసయ్య పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : ఫిబ్రవరి 1-3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలంటూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో కందారపు మురళి మాట్లాడుతూ సిపిఎం పేదల, కార్మికుల, కష్టజీవుల, ఉద్యోగుల పక్షాన రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. నాయకులు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఎన్.మాధవ్‌కృష్ణ, పి.బుజ్జి, పి.చిన్న, ఎం.నరేంద్ర పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : నెల్లూరులో ఫిబ్రవరి 1-3 తేదీల్లో జరిగే సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గూడూరులోని మార్కెట్ సెంటర్‌లో సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.

గూడూరులో...

కార్పొరేషన్ రద్దు పేరిట సౌకర్యాలు తగ్గించొద్దు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ రద్దు పేరిట కార్మికులకు సౌకర్యాలు తగ్గించవద్దని, టీటీడీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, టిటిడి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి. సుబ్రహ్మణ్యంలు టీటీడీ ఈఓ శ్యామలరావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం టీటీడీ పరిపాలనా భవనంలో కందారపు మురళి టీటీడీ ఈవో శ్యామల రావు తో కలిసి పలు అంశాలపై చర్చించారు. కార్పొరేషన్ లో విలీనాన్ని వ్యతిరేకిస్తూ అనేకమంది ఔట్ సోర్సింగ్, సొసైటీ ఉద్యోగులు రెగ్యులరైజేషన్ కై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, కోర్టులు ఇచ్చిన ఆదేశాల్ని టీటీడీ అమలు చేయడం లేదని వివరించారు. టీటీడీలో పనిచేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగులు ,కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరికీ ఒకే రకమైన సౌకర్యాలు, వేతనాలు అందించాలని 31వ తేదీన జరిగే టీటీడీ బోర్డు సమావేశంలో సానుకూలమైన నిర్ణయాలు చేయాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. బర్డ్‌లో గత ఏడాది జనవరిలో జరిగిన మెడికల్ ఆఫీసర్ ఇంటర్వ్యూల ఫలితాలు వెల్లడించాలని, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.మహతి ఆడిటోరియం అనేక రిపేర్లతో ఉన్నదని దానిని ఆధునికరించాలని, సీట్లను రిపేరు చేయాలని తిరుపతి నగర ప్రజలకు అందుబాటులో ఉండేటట్టుగా మార్పులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై సానుకూల నిర్ణయాలకై చర్చిస్తామని టీటీడీ ఈఓ శ్యామలరావు నేతలకు హామీ ఇచ్చారు.

గజరాజుల ఘీంకారాలు

'విజన్' లేని 'పవర్'

రైతన్నలకు అందని 'నష్ట' పరిహారం
శాశ్వత పరిష్కారానికి నోచని వైనం
భయం గుప్పెట్లో పంటల సాగు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి)

'ఆకాశంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు.. అంతరిక్షంలోకి రాకెట్లను సక్సెస్‌ఫుల్‌గా పంపిస్తున్నారు.. డ్రోన్లు ఉపయోగించి వ్యవసాయాన్ని లాభాల్లోకి తీసుకెళతామని 'విజన్' మాటలు 'పవర్'ఫుల్‌గా ప్రసంగిస్తున్నారు.. అయితే అటవీ పరిసర ప్రాంతాల్లో గజరాజులు ఘీంకారాలు చేస్తూ వందలాది ఎకరాల్లో పంట నష్టపరుస్తున్నా, చివరకు టిడిపి కార్యకర్తే మృత్యువాత పడినా పాలకులకు పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇదంతా సిఎం సొంత గడ్డ అయిన చంద్రగిరి నియోజకవర్గంలో.. ఇంత జరుగుతున్నా శాశ్వత పరిష్కారానికి మాత్రం అన్నదాతలు నోచుకోవడం లేదు. ఏ రోజు ఎవరి పంట నష్టపోతుందోనని తలలు పట్టుకుని టెన్షన్ పడటం, పట్టించుకునే దిక్కులేదని బాధపడటం అన్నదాతల వంతయ్యింది. డ్రోన్ కెమెరాలు, సిసి కెమెరాల సాయంతో ముందస్తుగా ఏనుగుల సంచారాన్ని గుర్తించి, పంట పొలాలను ధ్వంసం చేయకుండా వాటిని తరిమేయడం, శాశ్వత పరిష్కారంగా 'కంచె' వేయడం వంటివి చంద్రన్న 'విజన్'లో లేవన్నది వారి ఆవేదన.

చంద్రగిరి నియోజకవర్గంలో గజరాజుల దాడులతో రైతులు గడగడలాడుతున్నారు. యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల మండలాల్లో ఎక్కువగా ఏనుగులు దాడులు చేస్తూ పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. శేషాచలం, భాకరాపేట అటవీ ప్రాంతాలలో ఏనుగుల సంచారం అధికంగా ఉంది. రైతులు ఖరీఫ్, రబీ సీజన్లో వరి, టమోటా, కూరగాయ పంటలతో పాటు, మామిడి తోటలు సాగు చేస్తుంటారు. అయితే గజరాజులు పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలు, ప్లాస్టిక్ పైపులను ధ్వంసం చేస్తున్నాయి. అయితే ఘటన జరిగినపుడు మాత్రమే పాలకులు స్పందించడం, ఆ తరువాత పట్టనట్లు వ్యవహరించడం అన్నదాతలను ఆవేదనకు గురిచేస్తోంది. గత వైసిపి హయాంలోనూ మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తామని, సోలార్ ఫెన్సింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లు నిర్మిస్తామని హామీలిచ్చారు. హామీలు నెరవేరకనే కూటమి అధికారంలోకి వచ్చింది.

ప్రస్తుతం చంద్రగిరి మండలం కొండ్రెడ్డి కండిగ, మూలపల్లి, భీమవరం, శేషాపురం, నారావారిపల్లి ప్రాంతాలలో రోజురోజుకీ ఏనుగుల దాడులు అధికమవుతున్నాయి. పంట పొలాల్లో రైతుల వేసిన పంటలను భారీ స్థాయిలో ధ్వంసం చేస్తున్నాయి.. ఈనెల 18వ తారీఖున నారావారిపల్లి సమీపంలో ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుండగా ఏనుగులను తరిమెందుకు వెళ్లిన కందుల వారి పల్లి ఉపసర్పంచ్ ఎం తరిష్ బాబు (రాకేష్ చౌదరి) ని ఒంటరి ఏనుగు దాడి చేసి చంపేసింది. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు అటవీశాఖ అధికారులు నష్టపరిహారాన్ని అందజేశారు. అంతవరకూ సంతోషమే..... అదేవిధంగా పంటలను నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. చంద్రగిరి మండలంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.17 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. అటవీ ప్రాంతాల నుండి ఏనుగులు గ్రామాలు, పంట పొలాల వైపు రాకుండా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు. ఏనుగుల దాడులను నివారించడానికి అటవీ శాఖ ర్యాపిడ్ టీమ్స్, ఏనుగుల గమనాన్ని గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలు, ఎలిఫెంట్ ట్రాకర్ను ఏర్పాటు చేశామని చెబుతున్నా దాడులు ఆగడం లేదు. ఇందుకు తగినంత సిబ్బంది లేరని తెలుస్తోంది. డిప్యూటీ సిఎం, అటవీ శాఖామాత్యులు కొణిదెల పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కర్నాటక రాష్ట్రానికి వెళ్లి, ఆ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఏనుగులను కొంకి ఏనుగుల సాయంతో అడవుల్లోకి తరిమేలా చేస్తానని వెల్లడించారు. అయితే చర్యలు తీసుకున్నారో లేదో గానీ చంద్రగిరి మండలంలో ఎల్లంపల్లి, కొండ్రెడ్డి కండ్రిగ, భీమవరం ప్రాంతాల్లో ఏనుగులు పంట పొలాలను విధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు భయం గుప్పెట్లో పంటలను సాగు చేస్తున్నారు.

భయం భయంగా బతుకుతున్నాం

మోహన్‌రెడ్డి, మూలపల్లి, చంద్రగిరి

శేషాచలం, భాకరాపేట అటవీ ప్రాంతాల నుండి ఏనుగులు పంట పొలాల పై దాడులు చేస్తున్నాయి. పంటలను నష్టపరుస్తున్నాయి. గ్రామాలలో ప్రజలు భయం భయంగా బతుకుతున్నాం. ఏనుగుల దాడులు నివారణ కోసం మా ప్రాంత వాసైన సీఎం చంద్రన్న ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రైతులను కాపాడాలని కోరుకుంటున్నాం.

పంచాయతీ కార్యదర్శుల నూతన అధ్యక్షుడిగా చెంచయ్య

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా నారాయణపురం పంచాయతీ కార్యదర్శి చెంచయ్య నియమితులయ్యారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం పంచాయతీ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా చెంచయ్య, ఉపాధ్యక్షులుగా కొండారెడ్డి రాజేష్, కోశాధికారిగా లీలా కుమార్, జనరల్ సెక్రటరీగా కవిత, జాయింట్ సెక్రటరీగా లీలావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఎంపిడిఒ అభినందించారు.

హెల్మెట్ తప్పనిసరి : ఆర్టీవో

గూడూరు టౌన్ : ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని గూడూరు ఆర్.టి.ఓ కిషోర్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అధికారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాత బస్టాండ్ నుండి చిల్లకూరు జాతీయ రహదారి వరకు హెల్మెట్లతో వాహనాలు నడుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎం వి ఐ లు సునీల్, జకీర్, ప్రభాకర్ , సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసులు, కిషోర్ బాబు పాల్గొన్నారు.

డిఆర్‌డబ్ల్యులో వేడుకగా కల్చరల్ డే

గూడూరు టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు చదువుకోవాలనే ఉద్దేశంతో అల్లారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి ,డాక్టర్ సిఆర్ రెడ్డి డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలను ఏర్పాటు చేశారని, రాష్ట్ర స్థాయిలో కళాశాలకు మంచి గుర్తింపు ఉందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మెహర్ మణి వెల్లడించారు . గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో 44వ వార్షికోత్సవ సందర్భంగా కల్చరల్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమరావతి (గ్రూప్) డైరెక్టర్ ప్రత్యూష హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు గౌడ ఉప కులాల వారికి మద్యం షాపుల కేటాయించేందుకు చర్యలు తీసుకుందని, ఆసక్తి గల గౌడ, ఉపకులాల వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా అప్లికేషన్లు ఆన్లైన్ లేదా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలని గూడూరు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింట్ ఉషా శ్రీ తెలిపారు. గూడూరు డివిజన్లో మొత్తం 12 మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికుల గౌడ, ఉపకులాల వారికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారులు కరీమా బేగం, అరుణకుమారి, సురేంద్ర పాల్గొన్నారు.

అలిపిరి వద్ద ఇంటిస్థలాలివ్వాలి : చింతామోహన్

తిరుపతి సిటీ : టిటిడి అర్చకులు, శాశ్వత ఉద్యోగులకు అలిపిరి వద్ద ఇంటి స్థలాలు ఇవ్వాలని టిటిడి ఈవో శ్యామలరావు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ మంగళవారం లేఖ రాశారు. అలిపిరి నుంచి పేరూరు వరకు సర్వే నంబర్ 406లో 400 ఎకరాల టిటిడి భూములు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం వడమాలపేట వద్ద ఇచ్చిన స్థలాలను రద్దు చేయాలని కోరారు.

రథసప్తమి ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల

ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి ఏర్పాట్లపై టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. టిటిడి జేఈఓ వి.వీరబ్రహ్మం, సివిఎస్వో ఇంఛార్జి మణికంఠ చందోలుతో కలిసి భద్రత, జన రద్దీ నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షించారు. అంతకు ముందు ఆయన శ్రీవారి మెట్టు టోకెన్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు వర్చువల్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

బోర్లను మరమ్మతు చేయించాలి

గూడూరు టౌన్ : పుచ్చలపల్లి సుందరయ్యకాలనీలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆరు బోర్లను మరమ్మత్తు చేయించాలని సిపిఐ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, సురేష్, ప్రసాద్, పుట్ట శంకరయ్య పాల్గొన్నారు.

వైజెపి లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

గూడూరు టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై జె.పి టౌన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి.ఎం.జె . ఎఫ్ లీలాధర్ రెడ్డి , రీజియన్ సెక్రెటరీ బాల ప్రసన్న కుమార్ అధికార పర్యటన నిమిత్తం క్లబ్ కి విచ్చేసారు. ఆస్పత్రిలో పురిటి పిల్లలకు దుస్తులు, పౌష్టికాహారాన్ని అందించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మాలవ్యనగర్ లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా ఎస్.ఐ.ఎస్ మెడికల్స్ అధినేత సుభాన్ వ్యవహరించారు. తన తండ్రి కందలి కాలేషా 28 వ వర్ధంతి సందర్భంగా వద్ధులకు, వికలాంగులకు, నిరుపేదలకు తన నివాసంలో దుప్పట్లు, పండ్లు, చికెన్ బిరియాని పంపడం జరిగిందన్నారు.

ట్యాక్సీ కార్మికులకు రూ.10వేలు పింఛనివ్వాలి

తిరుపతి సిటీ : సిగ్నల్ పాయింట్ల చలానాలు, పెనాల్టీలు కట్టేందుకే ట్యాక్సీ తోలిన డబ్బు సరిపోతుందని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక ఓనర్ కం డ్రైవర్గా బతుకు జీవనం సాగిస్తున్నామన్నారు. ట్యాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలని ఎఐటియుసి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. తిరుపతి గంధమనేని శివయ్య భవన్లో యూనియన్ జిల్లా మహాసభ జరిగింది.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

పుత్తూరు టౌన్ : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఉన్నత విద్య, ఉపాధి ఉద్యోగ అవకాశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బి చంద్రమోళి అన్నారు. మంగళవారం పుత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో తిరుపతికి చెందిన వేఫోకస్ కెరీర్ పర్సన్ డాక్టర్ పైడి అంకయ్య, జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రత్నశేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఉన్నత విద్య అవకాశాలను వివరించారు. కళాశాలలో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయలు విలువైన కోచింగ్ ఉచితంగా అందిస్తామని ప్రిన్సిపాల్తో ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ కన్వీనర్ ఏ నాగేశ్వరరావు, కార్యక్రమ సమన్వయకర్త టి.నరసింహులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

రుయా డైరెక్టర్‌గా కరణం సందీప్

తిరుపతి : రుయా ఆసుపత్రి డైరెక్టర్ గా కరణం సందీప్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆసుపత్రి చైర్మన్ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. కమిటీలో ఇద్దరు డైరెక్టర్లుగా ఉంటారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ, దంపూరి భాస్కర్ యాదవ్ సహాయ సహకారాలతో పదవి రావడం జరిగిందని కరణం సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభును ప్రత్యేకంగా కలిశారు.

డిజిటల్ అరెస్టుల ముఠా గుట్టు రట్టు

ఆరుగురు నిందితులు అరెస్ట్
33 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయలు దోచేస్తున్న ముఠాగుట్టును తిరుపతి పోలీసులు రట్టు చేశారు. ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్న ఆరుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి 32.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఏఎస్ పి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, క్రైమ్, వెస్ట్ పోలీసు వారితో టీం ను ఏర్పాటు చేసి ఈ కేసుకు సంబంధించిన

విశాఖపట్నం చెందిన గణేష్ (34), పి రవికుమార్(28), యు. జగదీష్ (37), ఆనంద్ సంతోష్ కుమార్(39), అమరానంద్, (33), వాసుదేవ్ (34), ఆరుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 32.5 లక్షల నగదు, 141 గ్రాముల బంగారం, 8 సెల్ ఫోన్ లు, 2 ల్యాప్ టాప్, 1 సిమ్ మోడల్స్ , 8 రూటర్స్, ఒక ముద్దాయి అకౌంట్లోని బాధితురాలి 10 లక్షల నగదు ఫ్రీజ్ చేయడమైనది. ఈ కేసు లో ప్రతిభ కనబరిచిన వెస్ట్ సిఐ మురళీ మోహన్, సైబర్ క్రైమ్ సిఐ వినోద్ కుమార్, సీసీఎస్ సిఐ ప్రకాష్ కుమార్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు వెంకట్రావు, రవిమనోహరాచారి, మహిళా డి.యస్.పి శ్రీలత, సి.ఐ లు మురళి మోహన్ వెస్ట్, వినోద్ కుమార్ సైబర్ ల్యాబ్, యస్.ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల చెంత.. పిచ్చిమొక్కల చింత..

విద్యార్థులకు ఏమౌతుందోనన్న భయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

ప్రభుత్వ పాఠశాలలంటేనే కేరాఫ్ పేదల పిల్లలని అర్థం.. కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజులు కట్టలేక, తమకు అంత స్తోమత లేక పేద, దళిత తల్లిదండ్రులు ఎక్కువమంది తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తుండటం గమనార్హం. అయితే ప్రతిరోజూ ఉదయం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, సాయంత్రం తిరిగి క్షేమంగా వస్తారో లేదోననే భయం తల్లిదండ్రుల్లో నెలకొంది. కారణం పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పురుగుపుట్రకు నిలయంగా ఉండటమే కారణం.

శ్రీకాళహస్తి మండలంలో 136 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 4,209 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో మంగళపూరి పంచాయతీ ప్రాథమిక పాఠశాల ఒకటి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 76 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి విద్యను బోధించడానికి నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పిల్లలు ఆడుకోడానికి కావాల్సినంత ఖాళీ స్థలం ఉంది. అయితే ఆ ఖాళీ స్థలంలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ఏ పురుగు పుట్ర తమ పిల్లలను కాటేస్తుందోననే భయం తల్లిదండ్రుల్లో నెలకొంది. ఇకనైనా ఉపాధ్యాయులు స్పందించి కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎంఇఒ భువనేశ్వరిని వివరణ కోరగా మంగళపూరి ప్రాథమిక పాఠశాలలోని సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతకు తెలియజేసి శుభ్రం చేయిస్తానని తెలిపారు.

క్రీడల్లో ఏపీ ఖ్యాతిని పెంపొందించాలి : శాప్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ కీర్తిప్రతిష్టతలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. క్రీడల అభివద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మంగళవారం పలువురు క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌ను కలిశారు. యోగాలో గిన్నిస్ రికార్డ్ సాధించిన తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన సీహెచ్ వసంత లక్ష్మి స్పోర్ట్స్ కాంప్లెక్సులోని డీఎస్‌ఏ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇటీవల ఢిల్లీలో జరిగిన ఖోఖో తొలి ప్రపంచకప్‌లో ఇండియా నుంచి రిఫరీగా వ్యవహరించిన ఎస్.సురేష్‌కుమార్ శాప్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖోఖో నేషనల్స్‌లో ఏపీ నుంచి మూడుసార్లు ప్రాతినిథ్యం వహించానని, అలాగే సీనియర్ సౌత్ జోన్ నేషనల్స్‌లో ఎస్వీ యూనివర్సిటీ భాగస్వామ్యంతో

మూడుసార్లు పాల్గొని సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు. ప్రస్తుతం యదమర్రి మండలం కొటాలం జెడ్పీ ఉన్నతపాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ ఆయనను అభినందిస్తూ భవిష్యత్తులో ఖోఖో క్రీడాకారులకు మరిన్ని మెళకువలు నేర్పించి ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేయాలని సూచించారు. క్రీడల్లో ఏపీ సత్తాచాటాలని ప్రోత్సహించారు. తిరుపతి డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్, చిత్తూరు డీఎస్డీఓ బాలాజీ, కోచ్‌లు పాల్గొన్నారు.

'యుపిఎస్'ను కూటమి వ్యతిరేకించాలి: చీర్ల కిరణ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కొన్నేళ్లుగా పోరాడుతుంటే ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిపిఎస్ ఎంప్లాయిస్ పై గుదిబండ మోపుతూ యుపిఎస్ విధానాన్ని తీసుకువచ్చిందని, కూటమి ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించాలని ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ విధానంలో నాలుగు జీవోలు ఉంటాయని అందులో రెండింటిని గతంలో సీఎం చంద్రబాబు నాయుడు సిపిఎస్ ఉద్యోగులకు అనుకూలించే విధంగా మార్పుచేసి లబ్ధి చేకూర్చారన్నారు. వాస్తవానికి పెన్షన్ విధానం రాష్ట్రాల పరిధిలో ఉంటాయని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వంకిపురం పవన్ మాట్లాడుతూ ఐదేళ్లు పదవి అనుభవించే రాజకీయ నాయకులకు జీవితకాలపు పెన్షన్ అమలు చేస్తుంటే, ప్రభుత్వ ఉద్యోగులుగా 30 ఏళ్లు ప్రజలకు సేవ చేస్తే వారికి మాత్రం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వాలు ఎందుకు వెనుకంజ వేస్తున్నాయని ప్రశ్నించారు. మహిళా అధ్యక్షురాలు గుంటూరు రేఖ, ప్రధాన కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, భరత్, శేఖర్ పాల్గొన్నారు.

'రామా'...మా మొర వినుమా..!

అభివృద్ధికి నోచని రామాపురం దళితవాడ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

రామాపురం పంచాయతీ హరిజనవాడ సమస్యలకు నిలయంగా ఉంది. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలని పాలకులు చెప్పడమే గానీ, క్షేత్రస్థాయిలో కనీసం మురుగుకాల్వల్లో మురుగునీరు పోని పరిస్థితి. దీంతో దోమలకు నిలయంగా మారి, సీజనల్ వ్యాధులకు కేరాఫ్‌గా ఉంది. మండలంలో 46 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో రామాపురం పంచాయతీ ఒకటి. హరిజనవాడలో దాదాపు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు. రోజువారీ కూలీలు. ఈ కాలనీలో మురుగుకాలువలు నిర్మించారు. అయితే కాల్వల్లో ఎక్కడికక్కడ అక్కడ పేరుకుపోవడంతో మురుగునీరు పోలేని పరిస్థితి. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు నిలయంగా మారింది. రోజంతా కష్టపడి పనిచేసిన డబ్బు, సీజనల్ వ్యాధులు తగ్గించుకోడానికి ఖర్చు చేయాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రిపూట విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో విషపురుగుల భయం వారిని పట్టుకుంది. తాగునీరు కూడా లేని పరిస్థితి. కానీలో ఉన్న చేతిబోరును ఇక్కడినుంచి తొలగించడంతో, తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రామాపురం పంచాయతీ హరిజనవాడలో ఉన్న మురుగునీరు, విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వెంటనే తాగునీటి చేతిబోరు మరమ్మతు చేయించాలని రమణమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎంపిడిఒ పటాన్ రఫీఖాన్‌ను వివరణ కోరగా రామాపురం పంచాయతీ హరిజనవాడలో సమస్యలు తన దృష్టికి రాలేదని, పంచాయతీ కార్యదర్శి ప్రస్తుతం సెలవుపై ఉన్నారని, వేరే కార్యదర్శిని ఇన్‌ఛార్జిగా నియమించి, సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు.

రామాపురంలో మరమ్మతుకు నోచని బోరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ బకాయిలివ్వాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఎస్పీడీసీఎల్ సీఎండీని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కలిసారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ 2022 పిఆర్సి అరియర్స్ అమౌంటు లక్షా 30వేల బకాయిలు ఇవ్వాలని కోరారు. అలాగే 15ఏళ్లుగా వాచ్ అండ్ వార్డులుగా పనిచేసి ఆపరేటర్లుగా ప్రమోట్ అయిన వారికి జీతాలను 10వేలు పెంచాల్సి ఉందన్నారు. ఇప్పటికే నాలుగు లక్షలకు పైగా జీతాలను వారు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ మేరకు సిఎండికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, రవి, రాజా, భార్గవ్ ,ప్రసాద్, రూబన్, వినోద్, ధర్మ, గజ, సోము పాల్గొన్నారు.

సాధనతోనే మంచి మార్కులు : ఆర్‌జెడి

ప్రజాశక్తి - తిరుపతి

అందుబాటులో ఉన్న వివిధ రకాల పదవ తరగతి సంబంధ పుస్తకాల్లోని విషయాలను సాధన చేయడం ద్వారానే మంచి మార్కులు సాధించవచ్చని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఆర్ జె డి కే శామ్యూల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పట్నూల్ వీధిలోని నగరపాలక పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్ టి యు) ఆధ్వర్యంలో ప్రచురించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. పదవ తరగతి విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై పట్టు సాధించాలంటే మాదిరి ప్రశ్నాపత్రాలను సాధన చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ టి యు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే దాతల ద్వారా వివిధ జిల్లాల్లో 25వేల మంది పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందించామన్నారు. రాష్ట్ర నేత కే ధనుంజయ నాయుడు, ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే జగన్నాథం పాల్గొన్నారు.

ఎస్ఐకు టిడిపి నాయకుల అభినందనలు

బిఎన్ కండ్రిగ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, సత్యవేడు ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం సమక్షంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్‌ఐ విశ్వనాధనాయుడును టిడిపి నాయకులు అభినందించారు. రిటైర్ అయ్యే వయస్సులో యువ పోలీసు ఆఫీసర్లతో పోటీ పడుతూ అవార్డు అందుకోవడం అంకితభావానికి గుర్తన్నారు. అభినందించిన వారిలో టిడిపి నాయకులు కందేరి కార్తీక్‌నాయుడు, మునిచంద్రనాయుడు ఉన్నారు.

2న అరణియార్‌లోకి చేపపిల్లలు విడుదలకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - పిచ్చాటూరు

అరణియార్ ప్రాజెక్టులో 10 లక్షల చేపపిల్లలు వదిలేందుకు కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరేట్‌లో ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్లుతో చర్చించారు. గతంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతు చేయాలని, అవసరమైన నిధులు త్వరగా విడుదల చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని నియోజకవర్గంలోని మూడియార్, చామర్తికండ్రిగలకు మంజూరైన రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు చేపట్టాలని ఎస్‌ఇని కోరారు.

మహిళా వర్సిటీలో సెలెస్ట్రా -25

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సెలెస్ట్రా -25 కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. యువ ఆవిష్కర్తలు తమ ఆలోచనలు ప్రదర్శించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రిజిస్ట్రార్ రజని తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎం.ఎస్.శరవణన్, ఇంజనీరింగ్ కళాశాల సంచాలకులు ప్రొఫెసర్ మల్లికార్జున, సిఎస్సి విభాగాధిపతి ప్రొఫెసర్ సరిత, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ సాయి లోహిత ,కో కన్వీనర్ డాక్టర్ లక్ష్మీదేవి, స్టూడెంట్ కన్వీనర్ సుష్మ ,స్టూడెంట్ కో కన్వీనర్ హారిక పాల్గొన్నారు.

అగస్త్య మహర్షిపై జాతీయ సదస్సు

క్యాంపస్ : జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం, తిరుపతి, విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కాశీ తమిళ సంగం 3.0 లో భాగంగా అగస్త్య మహర్షిపై ఒక రోజు జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. సదస్సు భారతీయ నాలెడ్జ్ సిస్టమ్స్ కి అగస్త్య చేసిన విస్తారమైన సహకారాన్ని హైలైట్ చేసింది, దేశవ్యాప్తంగా పండితులు, విద్యార్థులు, విద్యావేత్తల నుండి భాగస్వామ్యాన్ని చూసింది. ఈ కార్యక్రమం సంప్రదాయ దీపాలు వెలిగించే కార్యక్రమం, తమిళ్ థాయ్ వాజ్తుతో ప్రారంభమైంది. విసి ప్రొ.జి.ఎస్.ఆర్ కష్ణమూర్తి సెమినార్‌ను ప్రారంభించగా, చెన్నైలోని మద్రాసు సంస్కత కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.అరుణ సుందరం ముఖ్యఅతిథిగా ప్రసంగించారు.

ముగిసిన జాతీయ సదస్సు

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంఘసంక్షేమ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు "మహిళలు సస్టైనబులిటీ ఎమర్జింగ్ స్ట్రాటజీస్" అనే అంశముపై జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. జాతీయ సదస్సు సావనీర్ ను ప్రొఫెసర్ వి. ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, డీన్ ప్రొఫెసర్ పి వాణి, ప్రొఫెసర్ గురుప్రీత్ కౌర్ ఆవిష్కరించారు.

DISSOLUTION INTIMATION

పెసల జయరాజగోపాల్ తండ్రి పెసల జయప్రకాష్
పెసల కిషోర్ తండ్రి పెసల జయప్రకాష్
పెసల సుశీల సరస్వతి భర్త పెసల జయరాజగోపాల్
పెసల రమేష్ కుమార్ తండ్రి పెసల బాలక్రిష్ణయ్య చెట్టి
అను మేము నల్గురము పార్టనర్లుగా నాయుడుపేటకు చేందిన శ్రీ రాజగోపాలచెట్టి ట్రేడర్స్ ఫర్మ్ రిజిష్టేషన్ నెం: 84 Of 2021 అను పార్టనర్‌షిప్ ఫర్మ్ 31-12-2024 న రద్దు (DISSOLVED) కాబడినది.
ఈ విషయాన్ని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

IN THE COURT OF THE CIVIL JUDOE (SENIOR DIVISION):: PUTTUR
O.S.No. 136/2017

Between
N. Jagadeesh ...**Plaintiff**
And
N. Jayalakshmamma and others ...**Defendants.**

To
SUMMONS TO DEFENDANT No.2.
D2: N. Ashok Naidu,S/o Late. Venkatesulu @ Venkatesh Naidu, Plot No.35, Industrial Estate. Settipalli post, Tirupati Urban Mandal, Tirupati District.
Sir,
Please take summons that the plaintiff filed the above suit against you and others for partition of the plaint schedule properties and the said suit was posted to 04-02-2025 for your appearance. If you have got any objections you may appear on 04-02-2025 at 10.30 A.M. either in person or through your counsel and file your objections. In the event of your failure, the matter will be decided exparte.
Hearing date: 04-02-2025
SRI K. PURUSHOTHAM, M.A., B.L.,
Advocate for plaintiff, Puttur.

క్రైం న్యూస్

ఓ మోతుబరి రైతు నిర్వాకం
విద్యుద్ఘాతంలో నాలుగు బర్రెలు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఓ మోతుబరి రైతు నిర్వాకం వల్ల విద్యుధాఘాతంతో నాలుగు బర్రెలు మృత్యువాత పడగా.. పాడి రైతుకు పుట్టెడు దు:ఖాన్ని మిగిల్చిన విషాదకర ఘటన తొట్టంబేడు మండలంలోని చిన్నకనపర్తి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం వెలుగు చూసింది. వివరాల్లోకి పోతే పెద్దకనపర్తి దళితవాడకు చెందిన పల్లమాల రమణయ్య బర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తనకున్న ఎనిమిది బర్రెలను తీసుకుని స్వర్ణముఖి నది అవతలి ఒడ్డుకు మేత కోసం వెళ్ళాడు. మధ్యాహ్నమయ్యాక భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లి తిరిగిరాగా నాలుగు బర్రెలు అదశ్యమయ్యాయి. వాటికోసం రాత్రి వరకు వెతికి చూసినా జాడ లేకపోవడంతో చేసేదిలేక ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. మంగళవారం ఉదయం మరోసారి బర్రెల జాడ కోసం ప్రయత్నించగా చిన్నకనపర్తి గ్రామానికి చెందిన చెరుకూరి వాసునాయుడి వరి పొలంలో విగత జీవులుగా కనిపించాయి. మోతుబరి రైతయిన వాసునాయుడు అడవి జంతువుల కోసం తన పొలం చుట్టూ విద్యుత్ తీగలు కట్టి కరెంటు సరఫరా చేయడం వల్లే బర్రెలు అన్యాయంగా మృతి చెందాయని రైతు రమణయ్య వాపోయారు. వాటి విలువ రెండు లక్షల పై మాటేనని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు రైతు నిర్వాకం వల్లే గతంలో దళితవాడలోని చేమూరు వెంకటరామయ్యకు చెందిన మూడు బర్రెలు మృతి చెందినట్లు గుర్తు చేశారు. అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా కరెంట్ లాగిన వాసు నాయుడుపై పోలీసు, ఫారెస్టు, విద్యుత్ శాఖాధికారులు తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని రైతు రమణయ్య కోరారు. ఆ మేరకు ఆయన తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటేరు పంచాయతి సచివాలయానికి నిప్పు

ప్రజాశక్తి -రామచంద్రపురం(తిరుపతి రూరల్)

తిరుపతి రూరల్ మండలం, ఓటేరు పంచాయతీ, గణేష్ లేఔట్ లో ఉన్న సచివాలయానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. కొత్తగా నిర్మించిన సచివాలయంలో పెండింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్నికల సమయంలో పరిశీలించినప్పుడు, సచివాలయ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం సుమారు 6:30 ప్రాంతంలో ఎవరు లేని సమయంలో చెత్త, చెదారం వేసి డోర్లు, కిటికీలకు మంట పెట్టారు. స్థానికులు గుర్తించి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు అదుపులోకి వచ్చాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్ల వ్యాను
క్లీనర్ వెంకటేష్ దుర్మరణం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)

మండలంలోని పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారి మామండూరు వద్ద ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాన్ ఢీకొని క్లీనర్ కే వెంకటేష్ (52) మతి చెందాడు. సోమవారం రాత్రి చంద్రగిరి మండలం మామండూర్ వద్ద హై వే లా రోడ్ ప్రక్కన ఆగిఉన్న లారీని కోళ్ల లోడ్ తో తిరుపతి వైపు వస్తున్న బొల్లోరా వాహనం వెనుకవైపు ఢీకొంది. కోళ్ల వ్యానుకు క్లినర్గా రామచంద్రపురం మండలం కూనేపల్లి గ్రామానికి చెందిన కవిలి వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ వేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సిఐ సుబ్బరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కె.వెంకటేష్ మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. డ్రైవర్ షణ్ముగం పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో రిజర్వు ఫారెస్ట్ లోకి చొరబడుతున్న కొందరు వ్యక్తులను అడ్డుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి ఆధీనంలోని ఆర్‌ఎస్ఐ విష్ణు వర్ధన్ కుమార్ బందం స్థానిక ఎఫ్బిఓ అనిల్ కుమార్ సహకారంతో అన్నమయ్య జిల్లా సానిపాయ కేంద్రం నుండి కూంబింగ్ చేపట్టారన్నారు. జాండ్రపెంట ఫారెస్ట్ బీట్ పరిధిలో కొరతుకోన వద్ద కొందరు వ్యక్తులు అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నించడాన్ని గుర్తించి వారిని చుట్టుముట్టడానికి ప్రయత్నం చేశారన్నారు. అందులో కొందరు పారిపోగా ఒక వ్యక్తి పట్టుబడ్డారన్నారు. పట్టుపడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రఫి తెలిపారు.

'మా భూమిని కబ్జా చేస్తున్నారు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

వంశపారంపర్యంగా సంక్రమించి తమ స్వాధీనసుభవంలో ఉన్న భూమిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అధికారులను లోబరుచుకుని కబ్జా చేస్తున్నారని రామచంద్రాపురం మండలం, సి.రామాపురానికి చెందిన బాధితుడు పూజారి సుబ్రమణ్యం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1964 నుండి రిజిస్టర్ డాక్యుమెంట్లు ద్వారా రామచంద్రపురం మండలం సి రామాపురం గ్రామ రెవిన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 163/1లో 88 సెంట్లు, 163/3లో 40 సెంట్లు భూమి కలిగి ఉన్నామన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన కొల్లం గుంట రామ్మూర్తి రెడ్డి, అతని కుమారుడు నరేంద్రబాబు రెడ్డి ఇద్దరూ కలిసి అధికారులను లోబరుచుకుని తమకు చెందిన 163/1లోని 88 సెంట్ల భూమిలో 14 సెంట్లు దౌర్జన్యంగా కబ్జా చేసి కూసాలను ఏర్పాటు చేసుకుని మొక్కలు నాటుతున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మమత, రాజేశ్వరి, మీనాక్షమ్మ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ జె.అరుణ భర్త జె.గణపతి రెడ్డి సూచన మేరకు దిగువ పేర్కొన్న షెడ్యూలు ఆస్థికి సంబందిచిన ఓరిజనల్ లింక్ డాక్యుమెంట్ నెం.14/1997ను నా క్లయింట్ పోగొట్టుకున్నారు. వీరు జె.ఎమ్. ఫినాన్స్‌హోమ్‌లోన్ సర్వీసెస్ నందు లోన్ కొరకు వెల్లగా వారు లింక్ డాక్యుమెంట్స్ గురించి వివరము అడిగారు. దారిపోయినదని తెలియజేసారు.కావున క్రింద పేర్కొన్న షెడ్యూలు ఆస్థి పై ఎటువంటి,ఆక్షేపణలు ఎవరికైననూ ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేది మొదలు ఏడు (7) దినముల లోపల క్రింద తెలిపిన అడ్రసుకు తెలియపరచవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

శ్రీ బాలాజి రి.డి.తిరుపతి పాకాల సబ్.డి.పాకాల మండలం- సామిరెడ్డిపల్లి పంచాయితీ-పాకాల గ్రామం సామిరెడ్డిపల్లి సర్కారు పుంజ సర్వే నెం.797/2, 0.45 శెంట్లలోఉత్తరం : జగన్నాథం ఇల్లు, దక్షిణం:సుబ్బారెడ్డి ఇల్లు, తూర్పు: గోవిందమ్మ నేల, పడమర : రాజావీధి ఈ మధ్య ఎ.0.04 శెంట్లు లేక 196 చ॥గ॥ కాలీజాగ.

BHOJANALA SINDHUJA,
ADVOCATE
D.NO.19-4-140, S.T.V.Nagar, Tirupati